తిరుపతికి సైన్స్‌సిటీ లేనట్టేనా?

కథనం
తిరుపతి, ఆంధ్రజ్యోతి

ప్రతిష్ఠాత్మక సైన్స్‌సిటీని తిరుపతి కోల్పోతోందా? చంద్రబాబు ఆలోచనల్లోంచి పురుడుపోసుకుని తిరుపతిలో స్థల ఎంపిక కూడా పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆతర్వాత జగన్ ప్రభుత్వం అటకెక్కించింది. రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ సైన్స్‌సిటీ పట్టాలెక్కుంతుందని అంతా ఆశపడ్డారు. అయితే ఏపీ సైన్స్‌సిటీని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్రప్రభుత్వం తాజాగా ప్రకటించడంతో కొత్త అనుమానాలు మొదలయ్యాయి. తిరుపతితో పాటూ అమరావతిలో కూడా సైన్స్‌సిటీలు ఏర్పాటు చేస్తారా? లేక తిరుపతి బదులుగా అమరావతిలో ఏర్పాటు చేస్తారా అనే స్పష్టత లేకపోవడం అయోమయానికి దారి తీస్తోంది. గతంలో చంద్రబాబే స్వయంగా తిరుపతిలో ప్రకటించి, తనే శంకుస్థాపన చేసిన నేపథ్యంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



2017 జనవరి 4న అప్పటి సీఎం చంద్రబాబు సైన్స్ సిటీకి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఆగమేఘాలపై అలిపిరి దగ్గర 70 ఎకరాలు

సైన్స్‌సిటీ కోసం అనువైన భూముల కోసం అన్వేషణ మొదలైంది. తిరుపతిలో అలిపిరి సమీపంలో అప్పటికే రీజనల్ సైన్స్ సెంటర్, ఎస్వీ జూపార్కు ఉన్నందున ఈ ప్రాంతం ఉపయోగకరమని భావించారు. టీటీడీకి చెందిన 70 ఎకరాలను గుర్తించారు. సర్వే నంబరు 588-ఏలో 50.96 ఎకరాలు, సర్వే నంబరు 589లో 19.15 ఎకరాలు చొప్పున మొత్తం 70.11 ఎకరాలు ఏపీ సైన్స్ సిటీకి లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు టీటీడీ అంగీకరించింది. ఇందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం జీవోఎంఎస్ నంబరు 365ను 2017 ఆగస్టు 16న జారీ చేసింది. 2017 జనవరి 4న సీఎం చంద్రబాబు ఏపీ సైన్స్ సిటీకి శంకుస్థాపన కూడా చేశారు. ఇక్కడిదాకా ఆగమేఘాలమీద జరిగిన పనులు ఆ తర్వాత మందగించాయి. నిర్వహణ, నిధుల కేటాయింపునకు సంబంధించిన అంశాలపై కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. రెండేళ్ల పాటూ పనులు ముందుకు కదల్లేదు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

జగన్ ఎసరు పెట్టారు

2019 జూన్‌లో జగన్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే సైన్స్‌సిటీని అటకెక్కించే ప్రక్రియ మొదలైంది. సైన్స్‌సిటీ రద్దు అనే మాట అనకుండా దానికి కేటాయించిన భూములను తెలివిగా లాగేసుకున్నారు. ఆ ప్రాంతంలోనే అద్భుతమైన స్పిరిచ్యువల్ సిటీని నిర్మించబోతున్నామని టీటీడీ పాలక మండలితో అక్టోబరు 23న తీర్మానం చేయించారు. దీనికి 500 ఎకరాలు అవసరమని ప్రతిపాదించారు. సైన్స్‌సిటీకి కేటాయించిన 70.11 ఎకరాలు వెనక్కి తీసుకోవాలంటూ ప్రభుత్వాన్ని టీటీడీ కోరింది. అప్పటి టీటీడీ ఈవో జవహర్ రెడ్డి లేఖలతో వెంటబడడంతో ఏపీ సైన్స్ సిటీకి ఇచ్చిన భూముల భూముల కేటాయింపును వైసీపీ ప్రభుత్వం రద్దు చేస్తూ 2020 జూన్ 4న జీవోఎంఎస్ నంబరు 167 జారీ చేసింది. స్పిరిచ్యువల్ సిటీ నిర్మాణానికి ఈ భూములను కేటాయించారు.

చంద్రబాబు పురుడు పోశారు

తిరుపతిలో 2017 జనవరిలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. నోబెల్ గ్రహీతలు సహా దేశవిదేశాల నుంచీ శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన మహామహులంతా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఘనమైన ఆతిథ్యం ఇచ్చింది. అప్పట్లో సీఎం చంద్రబాబు మహాసభల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సైన్స్ సంబరాలను చూసిన చంద్రబాబు, రాష్ట్రంలో సైన్సు, సాంకేంతిక పరిశోశనలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో రెండు కీలక ప్రకటనలు చేశారు. అందులో ఒకటి.. ఏపీ నుంచి నోబెల్ గ్రహీత అయినవారికి రూ.పదికోట్ల నగదు బహుమతి ఇస్తామన్నది. రెండోది.. సైన్స్‌కాంగ్రెస్‌కి ఆతిథ్యం ఇచ్చిన తిరుపతి నగరంలో సైన్స్‌సిటీ నిర్మిస్తామన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు ఇది.

గాల్లోనే స్పిరిచ్యువల్ సిటీ

స్పిరిచ్యువల్ సిటీ పేరుతో మొత్తం 138.09 ఎకరాలను తిరిగి టీటీడీకి స్వాధీనం చేసిన వైసీపీ ప్రభుత్వం.. ఆ తర్వాత అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఎన్నడూ స్పిరిచ్యువల్ సిటీ ఊసే ఎత్తలేదు. ఆ ప్రాజెక్టు రూపు రేఖల గురించిన ప్రతిపాదన లేదు. టీటీడీనా.. ప్రయివేటు సంస్థలా.. ఎవరు నిర్మిస్తారో తేల్చలేదు. చంద్రబాబు తలపెట్టిన ప్రాజెక్టును అటకెక్కించేసిన ఆనందంలో ఉండిపోయారు. తిరుపతి అభివృద్ధి జపం చేసిన వైసీపీ నాయకులు కూడా నోరు మెదపలేదు.

సైన్స్‌సిటీలో ఏముంటాయి..?

- ఇందులో ఏడు భిన్నమైన మ్యూజియంలు ఉంటాయి. ఇవి సాధారణ ప్రజలకూ, విద్యార్థులకూ సైన్సు, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తిని కలిగిస్తాయి. అవగాహన పెంచుతాయి.
- బయో మెడికల్, ఫిజికల్ సైన్స్ పరిశోధనలకు ఉద్దేశించిన రీసెర్చ్ ఇన్నొవేషన్ క్లస్టర్ ఉంటుంది. దేశంలోని ప్రతిష్ఠాత్మక సంస్థల ప్రాతినిధ్యంతో ఇవి నడుస్తాయి.
- సైన్సు, సాంకేతిక విజ్ఞాన వ్యాప్తి కోసం ఒక ప్రత్యేక సముదాయం ఏర్పాటు చేస్తారు.
- ప్లానటోరియం ఏర్పాటు చేస్తారు.

తిరుపతి కోల్పోయినట్టేనా?

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయినందున సైన్స్‌సిటీ ఆశలు మళ్లీ ప్రాణం పోసుకున్నాయి. అయితే అలిపిరి సమీపంలో ముంతాజ్ హోటల్‌కి స్థల కేటాయింపు రద్దు చేసే క్రమంలో స్పిరిచ్యువల్ సిటీతో పాటూ సైన్స్‌సిటీ భూములు కూడా రద్దు చేసి టీటీడీకి అప్పగించనున్నట్టు సీఎం ఇటీవల తిరుమలలో ప్రకటించారు. అయితే ప్రత్యామ్నాయంగా తిరుపతిలో మరో వైపున సైన్స్‌సిటీకి భూములు కేటాయిస్తారని అంతా భావించారు. ఈలోగా ఏం జరిగిందోగానీ అమరావతి పేరు తెరమీదకు వచ్చింది. తిరుపతిలో ఏర్పాటు చేయదలచుకున్న ప్రాజెక్టునే అమరావతిలో ఏర్పాటు చేస్తారా? లేక తిరుపతిలోనూ అమరావతిలోనూ కూడా సైన్స్‌సిటీలు ఏర్పాటు చేస్తారా అనే స్పష్టత లేదు. చంద్రబాబు తిరుపతికి ఇచ్చిన హామీని మరచిపోరని, తిరుపతి నగరంలో ప్రతిష్ఠాత్మక సైన్స్ సిటీని ఏర్పాటు చేస్తారనే నమ్మకం విద్యావేత్తలో మాత్రం ఉంది. చూడాలి.. ఏం జరుగుతుందో!



హోటల్ నుంచి వస్తున్న కల్యాణ్‌రామ్ - విజయశాంతి

తిరుపతిలో 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'

అర్జున్ సన్నాఫ్ వైజయంతి.. సినిమా నటుడు నందమూరి కల్యాణ్‌రామ్, అలనాటి నటి విజయశాంతి, హీరోయిన్ సాయిమంజ్రేకర్ బుధవారం మధ్యాహ్నం తిరుపతికి వచ్చారు. తాజ్ హోటల్లో విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అరగంటపాటు అభిమానులతో కల్యాణ్‌రామ్ ఫొటోలు దిగారు. అనంతరం చిత్తూరు వెళ్లేందుకు బయటకు వచ్చిన విజయశాంతిని చూడగానే అభిమానులు, యువత కేకలతో హోరెత్తించారు. నటి సాయిమంజ్రేకర్ అభిమానులతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం వీరు చిత్తూరులో ఒక పాట ఆవిష్కరణ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


స్టైల్ ప్లీజ్.. సాయి మంజ్రేకర్ ఫొటో తీస్తున్న అభిమాని



బట్టలు ఉతుక్కోడానికే పనికొస్తారు

'బట్టలు విప్పదీసి కొడతానన్నారు. రాబోయే రోజుల్లో బట్టలు ఉతుక్కోడానికే మీరు పనికొస్తారు. ఇదిగో, ఈ ఏరియల్, సర్ఫ్‌ఎక్సెల్, రిన్ ప్యాకెట్లను లోటస్‌పాండ్‌కి, బెంగళూరు.. తాడేపల్లి ప్యాలెస్‌కు, పులివెందులకు పంపిస్తాం. నిన్ను, నీ పార్టీని గతేడాది రాష్ట్ర ప్రజలు బండకేసి ఉతికి.. ఆరేసి 11 స్థానాలకు పరిమితం చేసినా ఇంకా జ్ఞానం రాలేదు' అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుడ్డలు ఊడదీసి కొడతామంటూ పోలీసుల ఆత్మస్థైర్యం.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన జగన్, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పోలీసు సెక్యూరిటీ లేకుండా మీరు ప్రజల్లోకి రాగలరా అని ప్రశ్నించారు. పోలీసుల బట్టలు కాదు.. కొన్నిరోజులు పోతే మీ డ్రస్సే మారుతుందని, ఓ ప్రత్యేకమైన నంబర్ కూడా మీకు వస్తుందని ప్రజలు అంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, పొనగంటి భాస్కర్, నవీన్‌రాయల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆంధ్రజ్యోతి

తాబేళ్ల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

చిల్లకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న తాబేళ్ల జాతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ బీచ్ వద్ద బుధవారం జిందాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఆలీవ్ రెడ్లీ జాతి తాబేళ్లను సముద్రంలోకి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడే తాబేళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులతోపాటు మత్స్యకారులు, స్థానికులపైనా ఉందన్నారు. సముద్రంలో కొన్ని వేల కిలో మీటర్లు తాబేళ్లు ప్రయాణించి తీర ప్రాంతాలకు వచ్చి గుడ్లు పెడతాయన్నారు. వాటిని కాపాడుకుని తాబేళ్ల ఉత్పత్తి, పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అంతరించిపోతున్న తాబేళ్లను సంరక్షించుకుంటే వాటి ద్వారా మానవ మనుగడకు, ప్రకృతికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మత్స్యసంపద ఉత్పత్తికీ తాబేళ్లు దోహదపడతాయని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ తెలిపారు. గుమ్మళ్లదిబ్బ బీచ్‌ను బెస్ట్ రిసార్ట్ ప్రాంతంగా మార్చుకునేందుకు కృషి చేద్దామన్నారు. తాబేళ్ల ఉత్పత్తికి కృషిచేస్తున్న అటవీశాఖ అధికారులకు జ్ఞాపికలు అందించి కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి, అటవీశాఖ అధికారులు శ్రీనివాసులు, గోపి, రమణయ్య, జిందాల్ పరిశ్రమ ప్రతినిధి శ్రీనివాస్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, సతీష్‌యాదవ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట, ఆంధ్రజ్యోతి: కోట మండలం శ్రీనివాస సత్రం వద్ద సముద్రంలోకి బుధవారం 150 తాబేళ్లను కలెక్టర్ వెంకటేశ్వర్ వదిలారు. ఈ ఆలీవ్‌రెడ్లీ తాబేళ్లతో జరిగే పర్యావరణ సమతుల్యంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు.


గుమ్మళ్లదిబ్బ వద్ద సముద్రంలోకి తాబేళ్లను వదులుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, అటవీశాఖ అధికారి వివేక్ తదితరులు

అతడి అక్రమార్జన రూ.2.7 కోట్లు

- ఏసీబీ సోదాల్లో తేలిందన్న అధికారులు
- పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య అరెస్టు
- రెండో రోజూ కొనసాగిన తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్యకు ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తేల్చారు. తమ సోదాల్లో ఇప్పటి వరకు అతడు 2,70,62,206 రూపాయలు అక్రమార్జనకు పాల్పడినట్లు తేలిందని బుధవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా మహేశ్వరయ్య ఓ బిల్లు చెల్లింపునకు చిన్నగొట్టిగల్లు మండలం పాలెం గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డిని నగదు డిమాండు చేశారు. ఆయన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు గత ఫిబ్రవరిలో రంగంలోకి దిగారు. రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా మహేశ్వరయ్యను పట్టుకుని అరెస్టు చేశారు. ప్రభుత్వం ఆయన్ను సస్పెండు చేసింది. ఇటీవల బెయిల్‌పై వచ్చారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులను మహేశ్వరయ్య కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరులో మంగళవారం సోదాలు జరిపారు. బుధవారమూ కొన్నిచోట్ల ఈ తనిఖీలు జరిగాయి. తిరుపతి రూరల్ పేరూరులోని ఆయన ఇంట్లో మొత్తం ఒకటిన్నర కిలో బంగారం, కిలో వెండి, రూ.35 లక్షల బ్యాంకు టర్మ్ డిపాజిట్లు, రూ.ఎనిమిది లక్షల నగదు గుర్తించి.. సీజ్ చేశారు. ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఇలా పలుచోట్ల ఆస్తులకు సంబంధించి 20 నుంచి 25 డాక్యుమెంట్లను అధికారులు సీజ్ చేశారు. బంధువులు, స్నేహితులు బినామీలుగా పలు బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్నట్లు గుర్తించిన వీరు.. త్వరలో వాటిని తెరిచేందుకు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శిగా నెలవారీ జీతం తక్కువగా ఉన్నా.. ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్ ఉన్నట్లు గుర్తించారు. అక్రమార్జనకు పాల్పడినట్లు తేలడంతో మహేశ్వరయ్యను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆయన్ను మళ్లీ కస్టడీకి తీసుకుని విచారించడానికి అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.


మహేశ్వరయ్య

అవినీతి అధికారుల సమాచారమివ్వండి

అధికారులు ఎవరైనా లంచం అడిగితే తిరుపతి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయండి. అలాగే, ఆదాయానికి మించి ఆస్తులున్న వారి వివరాలనూ మా దృష్టికి తీసుకురండి. సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. లంచం ఇస్తే కానీ పనులు చేయమని చెబుతున్న అధికారుల వివరాలు చెబితే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ అవినీతి జరిగినా 94404 41630 నెంబరులో ఏఎస్పీ విమలకుమారిని.. లేదా 94404 41690 నెంబరులో డీఎస్పీ జస్సి ప్రశాంతిని సంప్రదించండి. ప్రజల సహకారం ఉంటేనే అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవచ్చు.

- ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి

ఇండియన్ ఆర్మీరిక్రూట్ దరఖాస్తులకు నేడు ఆఖరి గడువు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ రిక్రూట్ దరఖాస్తులకు గురువారంతో గడువు ముగియనుందని సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ బుధవారం తెలిపారు. జనరల్ డ్యూటీకి 10వ తరగతి పాస్, అగ్నివీర్, అగ్నివీర్ క్లర్కు, స్టోర్ కీపర్ టెక్నికల్‌కు ఇంటర్ లేదా ఐటీఐ లేదా పాలిటిక్నిక్ పాస్, అగ్నివీర్ ట్రేడ్‌మెన్‌కు 8వ తరగతి నుంచి 10వ తరగతి పాసై ఉండాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9440573537, 7036428762, 0877-2286921లను సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా దూరవిద్య పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో దూరవిద్యా పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయని డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకున్నట్లు చెప్పారు. పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు.

తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు

- దామినేడు వద్ద 34 ఎకరాల కేటాయింపు
- రూ.1,500 కోట్ల అంచనాతో ఏర్పాటుకానున్న అకాడమీ

తిరుచానూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని దామినేడు లెక్కదాఖలా సర్వే నెంబరు 193/9 నుంచి 207/21 వరకు ఉన్న 34.70 ఎకరాలు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేశారు. ఒలంపిక్స్ ప్రమాణాలతో 38 రకాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహించేలా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఏర్పాటు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ.1,500 కోట్లతో స్పోర్ట్స్ అకాడమీకి శాప్ రూపకల్పన చేసింది. శాప్ ఎండీ నుంచి బుధవారం జిల్లా యంత్రాంగానికి స్థల కేటాయింపుల కోసం ప్రతిపాదనలందాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్సుకు కావాల్సిన భూమికి సంబంధించిన పత్రాలను రెండు మూడు రోజుల్లో శాప్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. కాగా, పలు అకాడమీలను ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు వెల్లడించారు. గ్రామీణ క్రీడాకారులూ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్సుకు ఆమోదం లభించడం సంతోషంగా ఉందన్నారు.


దామినేడు వద్ద ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీకి కేటాయించిన స్థలం

ఏం ఉంటాయంటే..

దక్షిణాది రాష్ట్రాల్లో బెంగళూరు వేదికగా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు ఉంది. ప్రస్తుతం తిరుపతిలో ఏర్పాటు కానున్న ఈ అకాడమీలో 500 సీట్ల సామర్థ్యంతో ప్రోకబడ్డీ, 500 సీట్ల సామర్థ్యంతో ఫుట్‌బాల్, హాకీ, జిమ్నాస్టిక్, ఖోఖో వంటి పలు అకాడమీలు ఏర్పాటు కానున్నాయి. రన్నింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 38 రకాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అకాడమీలు ఏర్పాటు కాబోతున్నాయి.

మామిడి కవర్లతో నాణ్యమైన దిగుబడులు


కవర్లు అందజేస్తున్న హెచ్‌వో శివకుమారి

భాకరాపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మామిడి కాయలకు కవర్లు కట్టడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖాధికారి శివకుమారి అన్నారు. భాకరాపేటలో బుధవారం బాలాజీ రైతు సంఘం ద్వారా రైతులకు మామిడి కవర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా మామిడి పంటకు చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటోందన్నారు. చీడపీడలతోపాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా కూడా ఎలాంటి నష్టం కలగకుండా కవర్లు రక్షణ కల్పిస్తాయన్నారు. నాణ్యమైన దిగుబడి లభిస్తుందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఎకరానికి రూ.4 వేలు, హెక్టారుకు రూ.10 వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. బాలాజీ రైతు సంఘం సభ్యులు మోహన్, నాగరాజు, కిరణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి


బయోమెట్రిక్ నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

భాకరాపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. రంగన్నగారిగడ్డ, చట్టేవారిపాళెం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లు పైబడిన చిన్నారులు, విద్యార్థులు తమ వేలి ముద్రలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. చిరునామా, పేర్లలో మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవచ్చునన్నారు. ప్రత్యేక క్యాంపులు ఈనెల 11 వరకు నిర్వహిస్తామన్నారు. ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ వికాస్ రెడ్డి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్ష తన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నందున అవసరమైన చోట స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అగరాల సర్పంచ్ భాస్కర్‌డ్డి కోరారు. . ఎంపీటీసీ చంద్రమౌళిరెడ్డి సూచన మేరకు చంద్రగిరిలో రేషన్ షాపులకు సరిపడ బియ్యం సరఫరా చేస్తామని తహసీల్దార్ తెలిపారు. జడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, తనహీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై బైండోవర్ కేసుల నమోదు

రామచంద్రాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అనుపల్లి పంచాయతీకి చెందిన రేకలచేను, ఉప్పలివంక గ్రామాల్లో ఇరువర్గాలకు చెందిన ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ట్రైనీ ఐపీఎస్ హేమంత్ బుధవారం తెలిపారు. ఇటీవల జరుగుతున్న చిన్న చిన్న సంఘటనల దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో తహసీల్దారు ఎదుట నలుగురిని హాజరు పరచినట్లు చెప్పారు. బుధవారం కూడా ముగ్గురిని బైండోవర్ చేశామన్నారు. డీటీ అమృత, ఆర్ఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన


ప్రకృతి సాగును పరిశీలిస్తున్న యూపీ ప్రతినిధుల బృందం, అధికారులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను యూపీ ప్రజాప్రతినిధుల బృందం, జిల్లా రైతు సాధికార సంస్థ అధికారులు పరిశీలించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం ఆధ్వర్యంలో అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన 46మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం మండలంలోని కుప్పంబాదురులో ప్రకృతి వ్యవసాయ కార్యకర్త సుబ్రహ్మణ్యంరెడ్డి వరిలో ఏగ్రేడ్ మోడల్, ఎన్ఎఫ్‌లో వరి పంట విధానం, వరిలో రసాయన పంట విధానాలను తెలుసుకున్నారు. యూపీలోని జాగృతి సేవా సంస్థ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మేనేజరు విజయ్ అమ్మాన్ నవర్ రైతులతో మాట్లాడారు.

నూతన ఆవిష్కరణలకు దోహదపడండి


ఐఐటీ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనల మేరకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ఇది నాంది పలకనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో తనను కలిసి తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణతో మాట్లాడారు. నూతన టెక్నాలజీ ఆవిష్కరణలతో ముందుకు వచ్చే విద్యార్థులకు ఈ హబ్ ఎంతో దోహదపడుతుందన్నారు. దీనికి మీ సహకారం కూడా అవసరమని కలెక్టర్ సూచించారు. అదానీ, అమరరాజా, నవయుగ పరిశ్రమల సహకారంతో ఆవిష్కరణలకు వచ్చే విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సహకారం ఉంటుందన్నారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు.

కల్వర్టు పైనుంచి పడి వృద్ధుడి మృతి


మృతి చెందిన చెంగల్రాయులు

చంద్రగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గంగుడుపల్లె వద్ద ఓవ్యక్తి ప్రమాదవశాత్తూ కల్వర్టుపై నుంచి పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వెదురుకుప్పం మండలం మొండి వెంగనపల్లెకు చెందిన చెంగల్రాయులు (65) సొంత పనుల నిమిత్తం బుధవారం చంద్రగిరికి వచ్చాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పక్కన కల్వర్టుపై కూర్చొని ఆటో కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యం మత్తులో కల్వర్టుపై నుంచి కిందపడి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

యోగ నరసింహస్వామి అలంకరణలో దర్శనం


ఉత్సవర్లను తీసుకొస్తున్న ఆలయ అధికారులు

చంద్రగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం రాములవారు యోగనరసింహస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవారికకి నిత్య కట్ల కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని యోగనరసింహస్వామిని అలంకరించారు. పుష్ప శోభాలంకృతమైన ఊయాలలో అదిష్ఠింపజేశారు. కన్నులపండువుగా ఊంజల్ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, టెంపల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసబట్టర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

వాహనచోదకులకు కౌన్సెలింగ్



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రామానుజపల్లి, తనపల్లి,హైవే, రహదారుల్లో నిబంధనలు పాటించని వాహన చోదకులకు పోలీసులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారిల ఆధ్వర్యంలో సీఐలు సునిల్‌కుమార్, చిన్నగోవిందు,ఎస్ఐలు, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ నెల రోజుల వ్యవధిలో జాయింట్ ఆపరేషన్ నిర్వహించి రాంగ్ రూట్‌లో వెళుతున్న 912 మంది వాహన చోదకులపై నమోదు చేశామన్నారు. సుమారు రూ. 22.80 లక్షలు అపరాధ రుసుం విధించారు.

కల్యాణ్ రామ్‌కి ఘనస్వాగతం


చంద్రగిరిలో గజమాలతో స్వాగతం

చంద్రగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సినీనటుడు నందమూరి కల్యాణ్ రామ్‌కు చంద్రగిరిలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆయన తిరుపతి నుంచి చిత్తూరుకు వెళ్తుండగా ఇక్కడి జాతీయ రహదారిలో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు గజమాల వేశారు. .

17న జిల్లాకు ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర 16వ ఆర్థిక కమిషన్ బృందం ఈ నెల 17వ తేదీ తిరుపతి జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో వర్చువల్ విధానంలో సమీక్షించారు. 17న ఆర్థిక కమిషన్ బృందం జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కలెక్టర్‌కు సీఎస్ దిశానిర్దేశం చేశారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుదారుల నిరీక్షణ


గతనెలలో ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

తిరుపతి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో బ్యాంకర్లు జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీసీ కార్పొరేషన్ (బీసీ, కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మిన్, క్షత్రియ) ద్వారా సబ్సిడీతో కూడిన రుణసదుపాయం కల్పించేందుకు గతనెల10న ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 21 బ్యాంక్‌లకు చెందిన ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. మండలంలో రూ.2.60కోట్ల రుణాలతో 115 యూనిట్ల ఏర్పాటు చేయాలనేది లక్ష్యం. 1447మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 917మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వడపోత అనంతరం 106 మందితో లబ్ధిదారలు జాబితాను తయారుచేసి బ్యాంక్‌లకు పంపారు. జాబితా చేరి 15రోజులు దాటింది. ఈనెల 7వతేదీ నాటికి వీరిలో ఒకరికి మాత్రమే రుణం మంజూరు చేశారని సమాచారం. ఈనెల11 నాటిని 25శాతం యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ప్రభుత్వం నుంచి ఎంపీడీవోకు ఆదేశాలు అందాయి. రెండు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ఏం చేయాలో తెలియక అధికారులు ఆందోళన చెందుతున్నారు. తాము పంపిన వారికే కాకుండా బ్యాంకరకు నచ్చిన వార్కైనా రుణం మంజూరు చేయాలని ఇప్పటికే మౌఖికంగా సూచించారని తెలిసింది. ఇటీవల బీసీ కార్పొరేషన్ ఈడీ బ్యాంకర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించినా ఆలస్యమైంది. దరఖాస్తుదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకర్లు రుణాలను మంజూరు చేస్తారని, తమ ప్రమేయం ఉండదని ఎంపీడీవో కార్యాలయ అధికారులు వివరిస్తుండడంతో దరఖాస్తుదారులు నిరాశగా వెనుతిరుగుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీతో భక్తుల ఇబ్బందులు


రైల్వేబ్రిడ్జి కింద నీటి మడుగులా మారిన వైనమిది

చంద్రగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు మార్గం వెళ్ళే మార్గంలో రైల్వే బ్రిడ్జి కింద నీటి మడుగులా తయారైయింది. దీంతో భక్తులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదే దారిలో కల్యాణి డ్యామ్ నుంచి తాగునీటి పైపు లైన్ ఉంది. శ్రీవారిమెట్టు నుంచి శ్రీనివాసమంగాపురం వరకు ఎల్‌అండ్‌టీ కంపెనీకి చెందిన నీటి పైప్‌లైన్ కూడా ఉంది. శ్రీనివాసమంగాపురం నుంచి శ్రీవారిమెట్టు ఎస్టీ కాలనీకి తాగునీటి పైప్ లైన్ కూడా వెళ్తుంది. పైపు లైన్ లీకేజీ ఏర్పడటంతో రైల్వే గోడల రంధ్రాల నుంచి నీరు కారుతోంది. ఫలితంగా బ్రిడ్జి కింద భాగం నీటి మడుగులా తయారైయింది. వారం రోజులుగా నీరు లీక్ అవుతున్నా బాధ్యులెవరూ పట్టించుకోలేదు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది భక్తులు వెళ్తుంటారు. టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ అధికారులు లీకేజి కట్టడికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మీ కాళ్లు మొక్కుతాం.. కేసు వెనక్కు తీసుకోండి

● భానుప్రకాశ్‌రెడ్డిని కోరిన వైసీపీ శ్రేణులు ● కేసులో ఇంప్లీడ్ కావాలంటూ టీటీడీ సభ్యుడి సూచన


భానుప్రకాశ్‌కు గులాబీ పూలు ఇస్తున్న వైసీపీ శ్రేణులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 'అన్నా మీ కాళ్లు మొక్కుతాం. కేసును వెనక్కి తీసుకోండి' అంటూ వైసీపీ శ్రేణులు టీటీడీ సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డిని ప్రాధేయపడ్డారు. తిరుపతి పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకంటూ టీటీడీ నుంచి 1700 మంది కార్మికులను కార్పొరేషన్‌కు కేటాయించేలా గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయంపై భానుప్రకాశ్‌రెడ్డి కేసువేసి అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం శ్రీదేవి కాంప్లెక్స్ ఆవరణలో భానుప్రకాశ్‌రెడ్డిని వైసీపీ శ్రేణులు కలిశారు. గులాబీ పూలు ఇచ్చి.. ఆయన ఎదుట మోకాళ్లపై కూర్చుని కేసు వెనక్కి తీసుకోవాలని అభ్యర్థించారు. కేసు వాపసు తీసుకొంటే దేశంలోనే తిరుపతి పారిశుధ్యంలో ప్రథమంగా నిలుస్తుందని చెప్పారు. కేసు వెనక్కు తీసుకునేది లేదని, ఇందులో వైసీపీ ఇంప్లీడ్ కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ వంశీ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాలి శేఖర్ రాయల్, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షులు గీతాయాదవ్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి నల్లాని బాబు, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి లవ్లీ వెంకటేష్, టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ వాసుయాదవ్ నేతలు రులు పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్ట్‌గా శ్మశానవాటిక అభివృద్ధి : నాని


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ శ్మశానవాటికను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో జాప్యంపై బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గాంధీపురం పంచాయతీలోని మదర్‌డెయిరీ(బాలాజి డెయిరీ) నుంచి వెలువడుతున్న మురుగునీటితో జనం ఇబ్బందిపడుతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే స్పందించారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులను ఆదేశించాలన్నారు.సంస్థ యాజమాన్యానికి నోటీసులివ్వాలని సూచించారు. ఎంపీడీవో రామచంద్ర, పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు తిరుపతి విష్ణునివాసం, శ్రీనివాసం నుంచి నాన్ ఏసీ బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణ చార్జి ఒకరికి రూ.600గా నిర్ణయించామని, ఆసక్తిగల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 08772289123, 9848007033లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో చేరండి


సమావేశంలో బ్రాహ్మణ సహకార పరపతి సొసైటీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో చేరాలని బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు చిత్రపు హనుమంతరావు కోరారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 2015లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రూ.30కోట్ల మూలధనంతో ప్రారంభమైన బ్రాహ్మణ సహకార పరపతి సంఘం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 78,490 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి బ్రాహ్మణుడూ సొసైటీలో చేరాలని, అతి తక్కువ వడ్డీకే ఆర్థిక సాయం పొందవచ్చని తెలిపారు. ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందన్నారు. విద్యార్థులకు చదువు నిమిత్తం రూ.2 లక్షల సాయం అందిస్తామని తెలిపారు. చేరదలచినవారు రూ.600 సభ్యత్వ రుసుం, ఆధార్, ఓటర్, పాన్ కార్డులు, ఫొటోలతో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9396855826, 9989932447లను సంప్రదించవచ్చని చెప్పారు.

శ్రీవారి సేవలో నేపాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు


జస్టిస్ ప్రకాష్ మాన్‌సింగ్ రౌత్, హరిప్రసాద్ పియాల్

తిరుమల, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): నేపాల్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ మాన్ సింగ్ రౌత్, న్యాయమూర్తి జస్టిస్ హరిప్రసాద్ పియాల్ బుధవారం వేకువజామున అర్చన సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వీరికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

ఎస్వీసెట్‌లో సినీసందడి

వేడుకగా అర్జున్ సన్నాఫ్ వైజయంతి ఆడియో లాంచ్





హీరోయిన్ సాయి మంజ్రేకర్ ప్రసంగం - హీరో కల్యాణ్ రామ్ అభివాదం - నటి విజయశాంతి నమస్కారం - విద్యార్థినుల కేరింతలు

పూతలపట్టు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తల్లీ, కొడుకుల మధ్య అనుబంధాన్ని తెలియజేసే సినిమా అర్జున్ సన్నాఫ్ వైజయంతి అని హీరో నందమూరి కళ్యాణ్‌రామ్ అన్నారు. పూతలపట్టు మండలం ముత్తిరేవుల సమీపాన గల శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)లో బుధవారం సాయంత్రం అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని విద్యార్థుల కేరింతల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా అమ్మలకు రుణపడి వుండాలన్నారు. అనంతరం సీనియర్ నటి విజయశాంతి మాట్లాడుతూ తన బిడ్డలాంటి కళ్యాణ్‌రామ్‌తో కలసి ఈ చిత్రంలో నటించడం చాలా సంతోషదాయకమన్నారు.నటుడు పృథ్వి అలియాస్ బబ్లూ మాట్లాడుతూ ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ తమ తల్లికి థ్యాంక్స్ చెప్తారన్నారు. అంతకుమునుపు చిత్రంలోని రెండవ పాట 'ముచ్చటగా బంధాలే'ని విడుదల చేశారు. అనంతరం కళాశాల ఛైర్మన్ రావూరి వెంకటస్వామి,చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా మంచి విజయం సాధిస్తుందని చెప్పారు.హీరో కళ్యాణ్‌రామ్‌ను, నటి విజయశాంతిని సన్మానించారు.హీరోయిన్ సాయి మంజ్రేకర్, దర్శకుడు చిలుకూరి ప్రదీప్, నిర్మాతలు అశోక్‌వర్ధన్, సునీల్ బాలు, ఎడిటర్ తమ్మిరాజు, కెమెరామెన్ రామ్‌ప్రసాద్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కళాశాల వైస్ ఛైర్మన్ రావూరి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ ఫంక్షన్ చూడ్డానికి చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి జనం తరలిరావడంతో కళాశాల ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది.పలు సినిమా పాటలకు విద్యార్థులు వేసిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి.

వైసీపీ నేత అండతో నా ఇంటిని కబ్జా చేస్తున్నారు

● అంబేడ్కర్ కాలనీకి చెందిన మహిళ ఫిర్యాదు


భూ రికార్డులు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు సుజాత

తిరుపతి (ఉపాధ్యాయ నగర్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నేత మద్దతుదారు నా ఇంటిని కబ్జా చేయాలని ప్రయత్నిస్తు న్నారు.. వారివల్ల నాకు, నా కుటుంబానికి ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి' అంటూ తిరుపతి రూరల్ మల్లంగుంట పంచాయతీ అంబేడ్కర్ కాలనీకి చెందిన సుజాత కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ 1984లో ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ఇంటి నంబర్ 6-64, అసెస్‌మెంట్ నంబర్ 1138, ఇంటి నంబర్ 6-29 అసెస్‌మెంట్ నంబర్ 603 ద్వారా పంచాయతీకి ప్రతి సంవత్సరమూ పన్ను చెల్లిస్తున్నానని చెప్పారు. అయితే ఒక అధికారి తనకు చెందిన రెండు ఇళ్లను కొనుగోలు చేశానని చెబుతూ 2008లోనే నకిలీ పత్రాలు సృష్టించి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించిందని వివరించారు. ప్రస్తుతం ఒక వైసీపీ సర్పంచి మద్దతుదారుడు రాత్రి సమయంలో తన స్థలంలో దౌర్జన్యంగా నిర్మాణం చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. దీనిపై మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. కాగా 2021 నుంచి పన్నులు కట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన దాడి ఘటనలో ఈస్ట్ పోలీసులు నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. దొడ్డాపురం వీధికి చెందిన విష్ణువర్ధన్ సొంత పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్నాడు. ఎయిర్ బైపాస్ రోడ్డులో జిమ్ నిర్వహిస్తున్న అజీమ్, ఓటేరుకు చెందిన బబ్లు, రుద్ర, బైరాగిపట్టెడకు చెందిన తేజారాయల్ కలసి అతనిపై దాడి చేశారు. మొబైల్ ఫోన్ లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (టీటీడీ), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రాస్-ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సుధారాణి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టు వేశాలమ్మ గుడి వీధి, సప్తగిరి కాలనీ (మంగళం), అంగన్‌వాడీ సహాయకురాలు ఎన్టీఆర్ కాలనీ, ఎస్టీవీ నగర్-1, మల్లయ్యగుంట కట్ట, సత్యనారాయణపురం, కొర్లగుంట-4, ప్రగతి నగర్‌లో ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 21 నుంచి 35 సంవత్సరాల లోపు వివాహితలు ఈ నెల 10 నుంచి 17వ తేదీ లోపు తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని రాస్ కార్యాలయంలో ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా అందించాలని తెలిపారు.

సాహిత్య సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలి


సన్మానం అందుకున్న పురస్కార గ్రహీతలు

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి పలువురు కళాకారులు, సాహితీవేత్తలు ఉగాది పురస్కారాలు అందుకోవడం సంతోషకరమని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉగాది పురస్కారాలు అందుకున్న వారిని యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సాహిత్యం తరగని సంపదని, దీన్ని అభివృద్ధి చేసి రాబోయే తరాలకు అందించాలని అన్నారు. అనంతరం పురస్కార గ్రహీతలైన ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి, శతవధాని ఆముదాల మురళి, డాక్టర్ వీఆర్ రాసాని, డాక్టర్ శ్రీవాణి ఎల్ల, డాక్టర్ ఉమా ముద్దుబాల, ఆకుల మల్లేశ్వరరావు, సాధన మునిరత్నం, పురుషోత్తమ నాయుడు, తులసీనాదము నాయుడు, ముని మల్లికార్జున, పద్మనాభం, ఆర్‌సీకే రాజు, పేట యుగంధర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దామోదర నాయుడు, డాక్టర్ నేమిలేటి కిట్టన్న, డాక్టర్ నడ్డి నారాయణ, సాకం నాగరాజు, వెంకటేశ్వర్లు, గంగాధర ప్రసాద్, అంకమ నాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

దేవనారాయణ రెడ్డికి పలువురి శుభాకాంక్షలు


మబ్బు దేవనారాయణ రెడ్డికి శ్రీదరి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులు


రుయా ఆస్పత్రి వద్ద కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టర్లు

తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. నగరంలోని పలుచోట్ల పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. మబ్బు దేవనారాయణ రెడ్డి ఇంటికి వచ్చి ఎమ్మెల్యే పులివర్తి నాని శుభాకాంక్షలు తెలిపారు. రుయా ఆస్పత్రి వద్ద మున్సిపల్ కాంట్రాక్టర్లు ఈశ్వర్, చంద్రబాబు, శ్రీనివాస్ రెడ్డి, మల్లి యాదవ్, మాధవయ్య, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు ఎస్వీఎం శ్రీధర్, రమణ, జగన్, సుబ్బు యాదవ్, రవితేజ నాయుడు, నాగప్రతాప్, దేవాచారి, రుషి, సుధాకర్ రెడ్డి, చంద్ర, శంకర్‌లు పాల్గొన్నారు. కార్పొరేటర్ అన్నా అనిత ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

విలువలతో కూడిన విద్య అవసరం

● అట్లాంటిస్ వార్షికోత్సవంలో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎంపీ గురుమూర్తి


చిన్నారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అత్యంత అవశ్యమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. కరకంబాడీ రోడ్డులోని అట్లాంటిస్ పాఠశాల 4వ వార్షికోత్సవాన్ని మహతి కళాక్షేత్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రవినాయుడు, గురుమూర్తి మాట్లాడుతూ అట్లాంటిస్ విద్యాసంస్థ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యాసంస్థల అధినేత కేఎస్ వాసు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల కృష్ణన్, వైస్ ప్రిన్సిపాల్ మోహకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో యువతలో క్రమశిక్షణ

డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు

ఎన్‌సీసీ నగర్‌లో శిక్షణ, వసతి కేంద్రం ప్రారంభం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ద్వారా యువతలో క్రమశిక్షణ, సామాజిక బాధ్యత అలవడతాయని అమరరాజా గ్రూప్ మాజీ చైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎన్‌సీసీ నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ శిక్షణ, వసతి కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. బాధ్యతాయుతమైన యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ అద్వితీయమైన కృషి చేస్తోందన్నారు. సమాజం పట్ల, పర్యావరణం పట్ల ఎన్‌సీసీ మంచి అవగాహన, బాధ్యతను అలవరుస్తోందని పేర్కొన్నారు. క్యాడెట్ల స్ఫూర్తి, నిబద్ధతను అభినందించారు. అనంతరం క్యాడెట్లతో ఆయన ముచ్చటించారు. గల్లా రామచంద్ర నాయుడును నిర్వాహకులు సత్కరించారు. ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ కమాండర్ సతీందర్ దహియా, కమాండింగ్ ఆఫీసర్ అనూజ్ వాద్వా పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయండి


ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న హెడ్ కానిస్టేబుళ్ల సంఘం నేతలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో ఎస్ఐల పదోన్నతుల విషయంలో న్యాయం చేయాలని కోరుతూ జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతిలో బుధవారం ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్‌కుమార్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. తాజాగా జరిగిన పదోన్నతుల్లో అడ్‌హక్ విధానం తీసుకుని మూడేళ్ల సర్వీసు కూడా లేని జూనియర్ అసిస్టెంట్లకు ఎస్ఐలుగా ప్రమోషన్లు ఇచ్చి తమకు అన్యాయం చేశారన్నారు. 30 సంవత్సరాల సర్వీసున్న హెడ్ కానిస్టేబుళ్లకు జరిగిన అన్యాయాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

ఫ్రెండ్లీ వైన్ షాపును మార్చండి

తిరుపతి సాయినగర్‌లో ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఫ్రెండ్లీ వైన్ షాపును వేరొక చోటుకు మార్చాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. మద్యం దుకాణానికి దగ్గరలో పీజీ హాస్టల్, విద్యా సంస్థలు, ఆస్పత్రులు ఉన్నాయని తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ స్కాలర్ మల్లెమొగ్గల దేవి అర్చన డాక్టరేట్ పొందారు. 'ఇన్ఫర్మేషన్ లిటరసీ స్కిల్స్ అమాంగ్ ద పబ్లిక్ లైబ్రరీ యూజర్స్ ఆఫ్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్-ఏపీఏ సర్వే' అంశంపై ప్రొఫెసర్ సురేంద్రబాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

రైల్వే రక్షణ సిబ్బందికి మౌలిక వసతులు

ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్


తిరుపతిలో ఆర్పీఎఫ్ డ్రై క్యాంటీన్‌ను ప్రారంభించిన అరోమాసింగ్ ఠాకూర్

తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో రైల్వే రక్షణ దళ సిబ్బందికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ వెల్లడించారు. తిరుపతిలోని ఆర్పీఎఫ్ బ్యారెక్స్ వద్ద బుధవారం డ్రై క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. జోనల్ కేంద్రమైన సికింద్రాబాదుతో పాటు విజయవాడ, తిరుపతి కేంద్రాల్లో క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. మన్మాడ్, గుంటూరు, గుంతకల్లు రైల్వేస్టేషన్లలో కూడా ప్రారంభిస్తామన్నారు. ఈ క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేసిన ఐపీఎఫ్ మధుసూదన్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు టి.మురళీకృష్ణ, కె.రాజగోపాల్‌రెడ్డి, జీఆర్పీ డీఎస్పీ హర్షిత, ఐపీఎఫ్‌లు కె.మధుసూదన్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

సుగుణమ్మ నివాసంలో ప్రజాదర్బార్


వినతులు స్వీకరిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ నివాసంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పలు సమస్యల పరిష్కారం కోసం ఆమెకు ప్రజలు వినతిపత్రం అందజేశారు. దీనిపై సంబంధిత అధికారులకు సుగుణమ్మ ఫోన్ చేసి పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు చినబాబు, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, మునిశేఖర్ రాయల్, ఆముదాల తులసీరాం, హేమంత్ రాయల్, విశ్వనాథం, రాజారాం, మునిచంద్ర పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక స్టిక్కర్లతో భక్తిని పంచిన ఆర్టీసీ బస్సు



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టేషన్‌లో నెల్లూరు ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఆధ్యాత్మిక స్టిక్కర్లతో భక్తిభావాన్ని పంచింది. కిటికీల పైనున్న గ్లాస్‌కు శ్రీవారి నామం, శంఖు, చక్రం, నరసింహస్వామి ప్రతిమలు భక్తులను అమితంగా ఆకర్షించాయి. ఇదే తరహాలో తిరుమల కొండకు రాకపోకలు సాగిస్తున్న 410 బస్సులకు కూడా శంఖు, చక్రం, నామం స్టిక్కర్లను అలంకరిస్తే తిరుమల బస్సులుగా భక్తులు సులభంగా గుర్తించే వీలు ఉంటుంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వెటర్నరీని సందర్శించిన మధ్యప్రదేశ్ మంత్రి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీని మధ్యప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి లఖన్ పాటిల్ బుధవారం సందర్శించారు. వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ, ఇతర వర్సిటీ అధికారులతో కలసి సమావేశమయ్యారు. వర్సిటీలో జరిగే పరిశోధనలు, ఇతర పశువైద్య సేవలు, కార్యక్రమాలను మంత్రికి వివరించారు. అనంతరం వర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించారు. గురువారం పలమనేరులోని లైవ్‌స్టాక్ పరిశోధనా స్థానాన్ని సందర్శించనున్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్, వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, డీఈ ప్రొఫెసర్ శోభామణి, డెయిరీ డీన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, సీవోఈ ప్రొఫెసర్ చెంగల్వరాయులు తదితరులు పాల్గొన్నారు.

అలుమ్ని భవన ప్రహరీ ప్రారంభోత్సవం

వర్సిటీలోని అలుమ్ని భవనానికి నిర్మించిన ప్రహరీని బుధవారం వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ ప్రారంభించారు. వర్సిటీ పూర్వ విద్యార్థి, ఎన్నారై దీని నిర్మాణానికి నిధులు అందించారని తెలిసింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో తొమ్మిది మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

ఒంటిమిట్ట కోసం లడ్డూలు సిద్ధం



ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమలలో శ్రీవారి లడ్డూలు సిద్ధం చేశారు. డిప్యూటీఈవో(జనరల్) శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది శ్రీవారిసేవకులు 70 వేల లడ్డూలను బుధవారం సిద్ధం చేశారు. 11న ఒంటిమిట్టలో జరిగే కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూను ప్రసాదంగా అందజేయనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో ప్రముఖులు





కొల్లు రవీంద్ర - ప్రజ్ఞానంద సరస్వతి

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, పెను గొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్,దివ్వెల మాధురి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఉన్నారు. దర్శనం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్టలో రాష్ట్ర కార్యక్రమంగా జరగాల్సిన కళ్యాణోత్సవాలను గత ఐదేళ్లూ నామమాత్రంగా చేశారని విమర్శించారు. తిరిగి అత్యంత వైభవంగా రాములవారి కల్యాణోత్స వాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు,వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,201

తలనీలాలు సమర్పించినవారు: 21,040





నాడు



నేడు

1970లో శ్రీవారి వసంతోత్సవం- ప్రస్తుతం ఇలా..

శ్రీహరి సేవకు.. తరలిరాద తనే వసంతం

- తిరుమలలో నేటి నుంచి వసంతోత్సవం

తిరుమలేశునికి సేవకు వనమే తరలిరానుందా..వేసవి నుంచి ఉపశమనం కలిగించనుందా.. శ్రీవారి వసంతోత్సవాల్లో అలాంటి దివ్యానుభూతి కలిగించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. వసంతఋతువులో మలయప్పస్వామికి జరిగే ఈ వేడుకను ఉపశమనోత్సవం అని కూడా పిలుస్తుంటారు. క్రీ.శ 1360 నుంచీ ఈఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు శాసనాధారముంది. చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేలా మూడురోజుల పాటు జరిగే వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వనమే దిగివచ్చిందా..

ఏటా వసంతోత్సవాలకు ఆలయం వెనుకభాగంలోని వసంతమండపాన్ని విశేషంగా అలంకరిస్తారు. శేషాచల అడవులను తలపించేలా పక్షులు, జంతువులు, వృక్షాలు, చెట్లు, పువ్వుల ఆకృతులతో తీర్చి దిద్దుతారు. ఉత్సవమూర్తులను కొలువుదీర్చే మండపాన్ని దాదాపు 250 కేజీల వట్టివేరుతో అలంకరిస్తారు. 600 కేజీల సంప్రదాయ పుష్పాలు, 10వేల కట్‌ఫ్లవర్స్‌తో సుందరంగా రూపొందిస్తారు. పచ్చని చెట్లు, పుష్పాలతో పాటు పలు రకాల పక్షులు,జంతువుల ప్రతిమలతో వనమే శ్రీవారి సేవకు తరలివచ్చిందా అనిపించేలా ఏర్పాట్లు చేశారు.

స్నపనంతో కన్నులపండువగా

గురువారం ఉదయం ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం స్నపనతిరుమంజనాన్ని ప్రారంభిస్తారు. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహిస్తారు. తర్వాత ఛత్ర చామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపడతారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా స్నపనం చేపడతారు. వీటితో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరిస్తారు. సాయంత్రం స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు.

స్వర్ణరథంపై ఉత్సవర్ల అభయం

రెండవరోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణరథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈఉత్సవంలో మహిళా ఉద్యోగులు, భక్తులు గోవిందనామస్మరణలు చేస్తూ రథనాన్ని లాగుతారు. గంట పాటు మాడవీధుల్లో వైభవంగా ఈవేడుకను నిర్వహిస్తారు. యథావిధిగానే వసంతమండపానికి ఉత్సవమూర్తులను వేంచేపు చేస్తారు. వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు.

యుగ పురుషుల దర్శనం


శనివారం శ్రీవారు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులతో కలిసి దర్శనమిస్తారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకిస్తారు. ఒకేవేదికపై సమస్త మూలవరులను ఒకేసారి దర్శనం కల్పించే అపురూప ఘట్టం సాక్షాత్కరిస్తుంది. అందుకే మూడవరోజు ఉత్సవంలో పాల్గొనేందుకు భక్తులు మక్కువ చూపుతారు. వసంతోత్సవాలు ముగిశాక మూడు యుగాల మూర్తులను మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఈమూడు రోజుల పాటు 'మేవా' అనే ప్రసాదాన్ని ప్రత్యేకంగా తయారు చేసి వితరణ చేయనున్నారు.

- నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

వ్యాధి మూలానికి మందు ఇదిగో

రోగికి కాదు.. రోగానికి చికిత్స అనే సూత్రంగా హోమియో వైద్యానికి గుర్తింపు ఉంది. దుష్ప్రభావాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులనైనా నయం చేయగల వైద్యప్రక్రియగా ప్రజలు విశ్వసిస్తారు. కొవిడ్ సమయంలో ఈ వైద్యానికి విశేష ఆదరణ లభించింది. తర్వాతా ఎక్కువమంది హోమియో వైపు మొగ్గు చూపుతున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



హోమియో వైద్య విధానానికి పెరుగుతున్న ఆదరణ

దీర్ఘకాలిక రోగాలకూ పరిష్కారం



మంగళంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల

జిల్లాలో 11 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. తిరుపతిలోని పాత ప్రసూతి ఆస్పత్రి భవనంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో హోమియో వైద్యశాల నడుస్తోంది. గతంలో రోజుకు సుమారు 4 వేల మంది వరకు వైద్యం పొందే వారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపైంది. పెరుగుతున్న ఆదరణకు ఇదే నిదర్శనం. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా హోమియోకు ప్రాధాన్యమిస్తూ ఆ ఆస్పత్రుల రూపురేఖలను మారుస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి రూరల్ పరిధిలో మంగళంలో పైలట్ ప్రాజెక్టు కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పేరుతో ప్రభుత్వ హోమియో వైద్యశాలను ఏర్పాటు చేసింది.

దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో చక్కటి పరిష్కారం లభిస్తుందని వైద్యులు చెబుతున్నారు. మందుల ఖరీదూ తక్కువే. జలుబు, దగ్గు నుంచి మైగ్రేన్ తలనొప్పి, మహిళల్లో వచ్చే రుతుక్రమ రుగ్మతలకు, ఆర్థరైటిస్, వెన్నునొప్పి, చర్మ, శ్వాసకోశ వ్యాధులకు, దీర్ఘకాలిక అలసట, హార్మోన్లలో వ్యత్యాసం, జీర్ణ రుగ్మతలకు, అలర్జీలకు హోమియోకు మించిన వైద్యం లేదని రోగులు చెబుతుంటారు. హోమియో మందు ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే ఎక్కువ కాలం ప్రభావం ఉంటుంది. వ్యాధి పునరావృతం కాదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. సహజ సిద్ధమైన పదార్థాలతో చేసిన మందులు కావడంతో చెడు ప్రభావాలు ఉండవు.

సురక్షితమైన వైద్యం



హోమియోను మించిన సురక్షితమైన వైద్యం ఇంకొకటి లేదు. మందులు ఆలస్యంగా పనిచేస్తాయనేది అపోహ మాత్రమే. వైద్యులు సూచించిన విధంగా వాడితే ఎంతటి వ్యాధికైనా శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రధానంగా మహిళల్లో వచ్చే నెలసరి సమస్యల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు నివారణ మార్గముంది. హోమియో వైద్యానికి అలవాటు పడితే ఇక ఏ వైద్యప్రక్రియనూ ఇష్టపడరు.

- డాక్టర్ ఎం.ఎస్.ప్రసన్న లక్ష్మి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, హోమియో వైద్యశాల, మంగళం



తిరుపతిలో సప్తగిరి తల్లి అంత్యక్రియలు

తిరుపతిరూరల్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ అంత్యక్రియలు బుధవారం తిరుపతిలోని గోవిందధామంలో నిర్వహించారు. తిరుపతి రూరల్‌మండలం శ్రీనివాసపురం పంచాయతీ తిరుమలనగర్‌వీధిలోని నివాసం వద్ద ఆమె భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. సప్తగిరిని పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

నరసింగాపురంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన

చంద్రగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన నిఖిత(17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పరువు హత్యగా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన అజయ్, నిఖిత కొద్దికాలంగా ప్రేమించుకుంటున్నారు. నరసింగపురానికి పొరుగున ఉన్న మిట్టపాలెం పంచాయతీ కొత్తూరు హరిజనవాడలోని తన అవ్వ ఇంటికి ఈ యువకుడు తరచూ వచ్చేవాడు. ఈక్రమంలో నిఖిత గర్భం దాల్చింది. ఈ విషయం తెలిసి నిఖిత తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అజయ్‌పై పోలీసులు పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారు. జైలులో ఉన్న అజయ్‌ను చూసేందుకు తరచూ నిఖిత వెళ్లడం తెలిసి తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. నెల క్రితం బెయిల్‌పై అజయ్ విడుదలయ్యాడు. అజయ్‌తో నిఖిత మళ్ళీ మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈనేపథ్యంలో గత శుక్రవారం ఇంట్లో నిఖిత మృతి చెందింది. గంటల వ్యవధిలోనే ఈమె మృతదేహానికి దహనక్రియలు నిర్వహించారు. ఆమె మృతి ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బుధవారం డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి సిబ్బంది నరసింగాపురం గ్రామానికి వెళ్ళి మృతురాలి తల్లిదండ్రులను విచారించారు. దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. దీనిపై సీఐను వివరణ కోరగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.





అజయ్, నిఖిత (ఫైల్‌ఫొటో), శ్మశానం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

మహిళా అధికారిని వేధించిన కేసులో ఫారెస్ట్ రేంజర్‌కు మూడు నెలల జైలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ ఫారెస్ట్ అధికారిని వేధించిన కేసులో రేంజర్‌కు సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఎస్.అనిల్‌కుమార్ మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2023లో దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ అధికారిగా పనిచేస్తున్న ఎస్కే అస్మ తున్నీసాతో రేంజర్ బొడ్డు వరప్రసాద్‌రావు అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా వేధింపులకు గురిచేశారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి సూళ్లూరుపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసు విచారించిన న్యాయమూర్తి అనిల్ కుమార్ నిందితుడు వరప్రసాదరావుకు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతికుమార్ కేసు వాదించారు.

ఆ మాటలేంటి జగన్?

- ఇకనైనా శవరాజకీయాలు మానుకో అన్న మంత్రి కొల్లు



తిరుపతి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులను బట్టలూడదీసి కొడతానని వైసీపీ అధినేత జగన్ బెదిరించడం చూస్తే అతనిపై క్రిమినల్ కేసు పెట్టాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అధికారులను భయపెట్టేలా మాటలేంటంటూ మండిపడ్డారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఆయన.. ఇప్పుడు అదే పోలీసులు రక్షణగా వస్తే వారిని అవమానపరిచేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తే జగన్ బయటకు వచ్చేఆరు కాదన్నారు. వైసీపీ హయాంలో ఏ చిన్న కార్యక్రమం చేయాలన్నా తమను హౌస్ అరెస్టులు చేసేవారని గుర్తుచేశారు. ఇప్పుడలా చేయడం లేదన్నారు. వైసీపీలో జరిగిన అక్రమాలపై లోతైన విచారణ జరుగుతోందని, అందుకే ఆలస్యం కావచ్చేమోగానీ ఎవరూ తప్పించుకోలేరన్నారు. కేసుల్లో ఉన్నవారు ముందుగానే బెయిల్‌కోసం ప్రయత్నిస్తున్నారంటే వారి ప్రమేయం ఉంటుందన్న అనుమానం కలుగుతోందన్నారు. అనంతపురం జిల్లాలో ఒక కుటుంబ తగాదాల్లో చనిపోయిన వ్యక్తిని శవ రాజకీయం చేశారని విమర్శించారు. ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి ఏపీలో శాంతిభద్రతలు లేవని నానా యాగీ చేసిన జగన్.. ఇప్పుడు శవరాజకీయాలు ఎత్తుకున్నారని విమర్శించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఏపీ రెండోస్థానంలో నిలవడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనమన్నారు. వైసీపీ పాలనలో జీడీపీ పూర్తిగా పడిపోతే దానిని పెంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తమ వర్గం కౌన్సిలర్లతో ఎంపీ గురుమూర్తి, రాంకుమార్‌రెడ్డి తదితరులు

భానుప్రియపైనే విశ్వాసం

- మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై మెజారిటీ కౌన్సిలర్లు విశ్వాసం ప్రకటించారు. వైసీపీకే చెందిన దొంతు శారద వర్గం 16 మంది కౌన్సిలర్లతో గత నెల 26వ తేదిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అవిశ్వాస తీర్మానంపై వినతి పత్రం అందించారు. ఈ క్రమంలో బుధవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగింది. ఈ మధ్యలో వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లను బుజ్జగించారు. మొత్తం 19 మందిని క్యాంప్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, 10.30 నుంచి 12గంటల మధ్య అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ప్రొసీడింగ్ అధికారిగా నిర్వహించారు. 11గంటలకు 19 మంది కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చారు. వీరు వైసీపీకే చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు అనుకూలంగా మద్దతు తెలిపింది. కాగా, దొంతు శారద వర్గం సమావేశానికి రాలేదు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ఎస్ఐ సుబ్బారావు, ప్రత్యేక పోలీసు సిబ్బంది పటిష్టమైనా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పారదర్శకంగా భూసేకరణ

- జేసీ శుభం బన్సల్



సత్యవేడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూసేకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూసేకరణలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటికే శ్రీసిటీ పరిధిలో ఏర్పాటు కానున్న ఎల్‌జీ పరిశ్రమకు 360 ఎకరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన 220 ఎకరాలను రైతులనుంచి సేకరిస్తుండగా, మిగిలిన భూములను శ్రీసిటీ నుంచి తీసుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు మరో 2,580 ఎకరాలకు సంబంధించి భూసేకరణ కోసం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఈ ప్రక్రియకూడా ప్రారంభమవుతుందన్నారు. భూసేకరణపై గ్రామ సభలుకూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించే విషయంలో ప్రభుత్వం తుది నిర్ణయం మేరకు ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డుల గదిని పరిశీలించారు.

సరిహద్దుల్లో నిఘా పెంచండి

- అక్రమ మద్యం కట్టడి చేయాలన్న మంత్రి కొల్లు
- తిరుపతిపై ఫోకస్ పెంచాలన్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులున్నాయి. ఇక్కడ నిఘా పెంచండి. గంజాయి, నాటుసారా, మాదక ద్రవ్యాలు రాకుండా పూర్తిగా కట్టడి చేయాలి' ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో బుధవారం జరిగిన ఎక్సైజ్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తిరుపతిలో ఎక్కువగా విద్యాసంస్థలు ఉన్నందున ఇక్కడ ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకుండా చూడాలి' అని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు నిషాంత్‌కుమార్, రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 70 సారా తయారీ కేంద్రాలను గుర్తించామని అక్కడ పూర్తిగా కనిపించకుండా చేయడానికి తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ వివరించారు. అవి కూడా లేకుండా గట్టిగా పనిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డీసీ విజయశేఖర్, ఎక్సైజ్ ఈఎస్‌లు నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, డిస్టలరీ ఈఎస్ జానకిరాం, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, అన్ని జిల్లాల డీసీలు, ఈఎస్‌లు, ఏఈఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆక్రమణల చెరలో విన్నమాల పంటకాలువ



ఆక్రమణలతో కుచించుకుపోయిన విన్నమాల పంటకాలువ

నాయుడుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని విన్నమాల పంట కాలువ ఆక్రమణలతో కుచించుకుపోతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఎల్‌ఏ సాగరం వద్ద స్వర్ణముఖినది నుంచి ప్రారంభమయ్యే విన్నమాల పంటకాలువ బీడీ కాలనీ, టీచర్ కాలనీ, పాత ట్రజరీ ఏరియా, పొగగొట్టం కాలనీ, రజక కాలనీ, ఆకుతోటవీధి, ఎల్‌ఐసీ, ఆర్యాగం నగర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం నుంచి జాతీయ రహదారి, రైల్వే ట్రాక్‌ను దాటుకొని విన్నమాల చెరువుకు నీరు అందిస్తుంది. దాదాపు 110 లింకుల వెడల్పుతో ఉండాల్సిన విన్నమాల పంటకాలువ ఆక్రమణలతో 35 అడుగుల మేర కుచించుకుపోయింది. విన్నమాల పంటకాలువ పూర్తిగా మున్సిపాలిటీ పరిధిలో ఉండటంతో ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విన్నమాల పంటకాలువను మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. కాలువ ఆక్రమణలను తొలగించి రూ.58 కోట్లతో ఆధునికీకరించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ కార్యాచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విన్నమాల పంటకాలువ ఆక్రమణలను తొలగించి పొలాలకు సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చిన్నారుల అస్వస్థతపై పీడీ విచారణ

అంగన్వాడీ వర్కర్, ఆయా సస్పెన్షన్



గ్రామస్థులను విచారిస్తున్న ఐసీడీఎస్ పీడీ వసంతబాయి

పెళ్లకూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ కానూరు దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటనపై ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత బాయి విచారణ చేపట్టారు. బుధవారం గ్రామానికి చేరుకున్న ఆమె అంగన్వాడీ వర్కర్, ఆయాలతో పాటు చిన్నారుల తలిదండ్రులను, గ్రామస్థులను విచారించారు. గత 20 ఏళ్లుగా ఇక్కడ ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగగపోవడం వల్ల ఇది మొదటి తప్పుగా పరిగణలోకి తీసుకుని అంగన్వాడీ వర్కుజుజీ శ్రీదేవితో పాటు ఆయా రాఘమ్మను సస్పెండ్ చేశారు. మళ్లీ ఇటాంటి ఘటనలు పునరావృత్తం అయితే ఉద్యోగం నుంచి తొలిగిస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతులకు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం విషయంలో వర్కర్లు, ఆయాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కొండ్రెడ్డి ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, చెంబేడు వైద్యులు చంద్రమోహన్, రియాజ్ ఇద్రైతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అదుపులోకి డంపింగ్ యార్డు మంటలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులో మంగళవారం ప్రమాదవశాత్తు సంభవించిన మంటలను అధికారులు అతికష్టం మీద బుధవారం అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగిన వెంటనే మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య సిబ్బందితో అక్కడకు చేరుకొని అగ్నిమాపక సిబ్బంది, హైవే సిబ్బంది, షార్ అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. పక్కనే ఉన్న కాళంగి నదిలో మోటర్లు ఏర్పాటు చేసి ఫైర్ ఇంజన్ల సాయంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు డంపింగ్ యార్డులో నీటిని చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. కాలిన చెత్తను ఎక్స్‌కవేటరు సాయంతో తొలగించనున్నట్లు కమిషనర్ తెలిపారు. డంపింగ్ యార్డు పట్టణ నడిబొడ్డులో ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం స్థల కేటాయిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ కమిషన్ చెప్పారు.

గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 3 నుంచి 9 తరగతుల్లో ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శుభకర్‌రావు కోరారు. 3వ తరగతిలో 80, 4లో 78, 5లో 72, 6లో 59, 7లో 22, 8లో 1, 9వ తరగతిలో 11 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. వివరాలకు 6309089327 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

బస్సుల ప్రారంభం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకు వచ్చిన రెండు కొత్త బస్సును స్థానిక బస్టాండు వద్ద బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగానే సూళ్లూరుపేట డిపోకు అదనంగా రెండు కొత్త బస్సులను తీసుకొచ్చామన్నారు. సూళ్లూరుపేట నుంచి హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై నగరాలకు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జున, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.





గోతులమయంగా ఉన్న పోటుపాళెం రోడ్డు - రాళ్లు తేలిన విందూరు రోడ్డు

గుంతలు పడి... కంకర తేలి

- గోతులమయంగా గ్రామీణ రోడ్లు
- ప్రయాణికుల అవస్థలు

గూడూరు, ఏప్రిల్ 9: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు గోతులమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లు గోతులు పడి, రాళ్లతేలడంతో రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గూడూరు నుంచి మిటాత్మకూరు గ్రామానికి వెళ్లే 15 కిలోమీటర్ల రోడ్డు పలు గ్రామాల వద్ద గోతుమయంగా, రాళ్లు తేలింది. ఈ రోడ్డు ద్వారా వేములపాళెం, రామలింగాపురం, విందూరు, సంతదాసుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరుగ్రామాల ప్రజలు గూడూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రిపూట ప్రయాణించే వాహనదారులు గోతులు కనిపించక ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాకుండా విందూరు, వేములపాళెం తదితర గ్రామాల సమీపంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద వేగ నిరోధకాలను ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గూడూరు నుంచి పోటుపాళెం గ్రామానికి వెళ్లే రోడ్డు కూడా గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు మండలం చవటపాళెం నుంచి దివిపాళెం వెళ్లే మార్గంలో రోడ్డును అభివృద్ధి పరచకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొనిందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా గ్రామీణ రోడ్లను అభివృద్ధి పరచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





దిమ్మెలస్థాయిలో ఆగిపోయిన మీజూరు చెక్‌డ్యామ్ - అసంపూర్తిగా ఉన్న వేలికాడు చెక్‌డ్యామ్

తీర ప్రాంతంలో సాగునీటి కష్టాలు తీరేదెన్నడో..!

ఏళ్ల తరబడి అసంపూర్తిగా చెక్‌డ్యామ్‌లు ● బీడుగా తీర ప్రాంత భూములు

దొరవారిసత్రం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పులికాట్ తీరంలో ఏడువేల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి ఐదు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి పునాది వేశారు. దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల పరిధిలోని పులికాట్ ప్రాంతంలో మీజూరు వద్ద రెండు, వేలికాడు, కారికాడు, బురదగాలికొత్తపాళెం వద్ద ఒక్కొక చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటి రాజకీయ పరిస్థితులు మారడంతో పనులు ప్రారంభించలేదు. 1998లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.8 కోట్ల అంచనాలతో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలను తిరిగి ప్రారంభించారు. 2004వరకు నత్తనడకన పనులు సాగుతూ వచ్చాయి. మీజూరు వద్ద నిర్మించిన రెండు చెక్‌డ్యామ్‌లలో ఒకటి 50శాతం మేర పనులు పూర్తి చేశారు. మరోకటి గోడలకే పరిమితం అయింది. ఈ చెక్‌డ్యామ్‌ల దిగువ ప్రాంతంలో చేపట్టిన వేలికాడు వద్ద చెక్‌డ్యామ్ పునాదుల్లోనే ఆగిపోయింది. కారికాడు వద్ద కరకట్టలతోనే నిలిపేశారు. అలాగే చిట్టమూరు మండల పరిధిలో బురదగాలికొత్తపాళెం వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ ఎగువ ప్రాంతంలో కట్టిన చెక్‌డ్యామ్‌లు పూర్తికాకపోవడంతో వర్షపునీరు సముద్రం పాలవుతోంది. ఈ ఐదు చెక్ డ్యామ్‌లను పూర్తిచేస్తే తీరప్రాంతంలో సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలున్నాయి. దొరవారిసత్రం మండలంలో మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, బేరుజంగాలపల్లి గ్రామాలు, చిట్టమూరు మండలంలో మరో ఐదు గ్రామాల రైతులకు సాగునీరు చేరి లబ్ధి చేకూరుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో చెక్‌డ్యామ్‌లు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. మరో రూ.4కోట్లు వరకు ఖర్చు చేస్తే అసంపూర్తిగా ఉన్న చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తవుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెక్‌డ్యామ్‌లను పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హంస వాహనంపై శ్రీరాముడు

గూడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి మిట్టలోని కోదండ రామాంజ నేయస్వామి ఆలయంలో బ్రహ్మో త్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉద యం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి చొప్పరం ఉత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామివారిని హంస వాహ నంపై అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. వెంకటరమణయ్య, శైలజ కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

గూడలిలో పోషణ్ పక్వాడా

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి దక్షిణపాలం, కోట దళితవాడ అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు మొదటి 1000 రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యమైన జీవనశైలి, ఉబకాయం ఉన్న చిన్నారులకు ఇవ్వాల్సిన ఆహారం తయారుచేసే విధానాన్ని తెలియజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో డాక్టర్ హరిప్రసాద్ దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, రామ్మోహన్, ప్రభాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో మెహ బూబి అన్నారు. మంగళహూరు అంగన్ వాడీ కేంద్రంలో పోషణవాటిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ స్వరూపారాణి, జీవనజ్యోతి, రమణమ్మ పాల్గొన్నారు.

గోవిందపల్లిపాళెంలో సాగర కవాతు

కోట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రతీరంలో బుధవారం పోలీసులు సాగర కవాతు నిర్వహించారు. ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సాగర తీరానికి వస్తున్న స్టీమర్లు, బోట్లు, మరపడవలను తనిఖీ చేశారు. ఆయా సముద్రతీర గ్రామాల్లోని మత్స్య కారులకు అవగాహన కల్పించారు.

నేడు, ఎల్లుండి పలు రైళ్ల రద్దు

తడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కవర్‌పేట - పొన్నేరి మధ్య సిగ్నల్ వ్యవస్థ, పట్టాల మార్పిడి పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం, శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు. ఆ రెండు రోజుల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రైళ్ల రాకపోకలను నిలిపివేస్తారు. సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి నెల్లూరుకు వెళ్లే మెమో(66037) రైలు, నెల్లూరు నుంచి సాయంత్రం 6.45 నిమిషాలకు బయలుదేరి సూళ్లూరుపేటకు వచ్చే మెమో(66038) రైలును పూర్తిగా రద్దు చేశారు. అలాగే సూళ్లూరుపేట నుంచి చెన్నైకు ఉదయం 11.45, మధ్యాహ్నం 3.10 నిమిషాలు, రాత్రి 9 గంటల వెళ్లే రైళ్లు రద్దు కాగా చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 నిమిషాలకు వచ్చే సబర్బన్ రైళ్లు రద్దు అయ్యాయి. మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశామని రైల్వే అధికారులు వెల్లడించారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: విజయశ్రీ



ఎమ్మెల్యేకు అర్జీ ఇచ్చి సమస్యను వివరిస్తున్న ఉచ్చూరు సాగునీటి సంఘ అధ్యక్షుడు వెంకటరమణ, పక్కన టీడీపీ నేత చిరంజీవి తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో ప్రజలు అందజేసే ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పలు సమస్యలపై దాదాపు 40 అర్జీలు వచ్చాయి. దొరవారిసత్రం మండలం ఉచ్చూరు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు బస్సును నిలిపివేశారని, రోడ్డుకు మరమ్మతులు చేసి బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని నీటి సంఘ అధ్యక్షుడు పామంజి వెంకటరమణ గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యేకి అర్జీ అందజేశారు. గ్రామంలో తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, శ్రీనివాసుల నాయుడు, తిరుపాల్, గురుకల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులతో డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులను బుధవారం డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అభినం దించారు. 2024-25 విద్యా సంవత్స రంలో అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం తరపున ఎన్‌బీకేఆర్ విద్యార్థులు చందన, చందు, వంశీధర్‌రెడ్డి, శ్రీనివాసులు, బిందుమాధవ్, మాధవరాజు, వెంకటహావేష్, ఇందువర్షిణి, ప్రసాద్, మనో హర్‌రెడ్డి, మహేంద్రర్, గాయ త్రి, చందన, ఆవుల చందు, శ్రావన్‌కుమార్, అలెక్స్ మాణిక్యం, కృష్ణారెడ్డి పలు క్రీడల్లో ప్రతిభ చూపారని తెలిపారు. బుధవారం కళాశాలలో క్రీడాకారులను డైరెక్టర్, విభాగాధిపతులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో తొమ్మిది మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన దాడి ఘటనలో ఈస్ట్ పోలీసులు నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ మహేష్ వివరాల మేరకు... దొడ్డాపురం వీధికి చెందిన విష్ణువర్ధన్ సొంత పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్నాడు. ఎయిర్ బైపాస్ రోడ్డులో జిమ్ నిర్వహిస్తున్న అజీమ్, ఓటేరుకు చెందిన బబ్లు, రుద్ర, బైరాగిపట్టెడకు చెందిన తేజారాయల్ కలసి అతనిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. పాత కక్షలు ఉన్నాయా లేకుంటే మద్యం మత్తులో దాడికి దిగారా అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నూతన ఆవిష్కరణలకు దోహదపడండి



ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనల మేరకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ఇది నాంది పలకనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో తనను కలిసి తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణతో మాట్లాడారు. నూతన టెక్నాలజీ ఆవిష్కరణలతో ముందుకు వచ్చే విద్యార్థులకు ఈ హబ్ ఎంతో దోహదపడుతుందన్నారు. దీనికి మీ సహకారం కూడా అవసరమని కలెక్టర్ సూచించారు. అదానీ, అమరరాజా, నవయుగ పరిశ్రమల సహకారంతో ఆవిష్కరణలకు వచ్చే విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సహకారం ఉంటుందన్నారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు.

పుత్తూరు వార్తలు

పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ లక్ష్యం

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ లక్ష్యమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు పట్టణంలో రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఆయన చేతుల మీదుగా పేదలకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతుందని చెప్పారు. చేనేత కార్మికులకు ఉచితంగా 500 యూనిట్లు, రానున్న కాలంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి, దాచుకో, దోచుకో అన్న చందాన వ్యవహరించారని, ఈ ప్రభుత్వంలో ప్రజలందరూ స్వేచ్ఛగా, ఆనందంగా బతుకుతున్నారని చెప్పారు. అనంతరం ఆయన పేదలతో కలిసి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రమేష్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, జనసేన నగరి ఇన్‌చార్జి మెరుపుల మహేష్, టీడీపీ నేతలు షణ్ముగరెడ్డి, ధనంజయులు నాయుడు, లక్ష్మీప్రసన్న, ఎస్.ఎస్.ధనపాల్, అన్న క్యాంటీన్ సైట్ ఇంజనీర్ మురళీ, దిలీప్, బాబునాయుడు, రజని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతుల పేరుతో అండర్‌బ్రిడ్జిల మూసివేత

● అవస్థలు పడుతున్న ప్రజలు



అండర్‌బ్రిడ్జిని మూసివేస్తున్నట్లు రైల్వే అధికారుల బోర్డు

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై-ముంబై రైల్వే లైన్లలో భాగంగా తడుకు సమీపంలో ఏర్పాటు చేసిన అండర్‌బ్రిడ్జిలకు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో రెండు నెలలు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో అండర్‌బ్రిడ్జి ద్వారారాకపోకలు సాగించే తడుకు, ఎగువ గూలూరు, దళితవాడ, దిగువ గూలూరు, శిరుగురాజపాలెం, పొట్టిగుట్ల గ్రామాల ప్రజలు నానావస్థలు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించడానికి లేకుండా మూసివేశారు. ప్రత్యామ్నాయ మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాల జీవితాన్ని ఆస్వాదిస్తూనే ఉన్నత స్థాయికి చేరుకోవాలి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కళాశాల జీవితాన్ని ఆస్వాదిస్తూనే లక్ష్యాన్ని మరచిపోకుండా ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో కష్టపడి జీవితంలో పైకి రావాలని అన్నారు. తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడి మీద అభిమానంతో రాష్ట్రంలో తొలిసారిగా సైన్సు సబ్జెక్టుతో పాటు ఆర్ట్స్ కళాశాలను మంజూరు చేసిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ ప్రత్యేకించి ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం అరుదైన విషయమని అన్నారు. విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆధునిక, సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరయ్య, వీరయ్య, సుజన, నరసింహులు, నాయకులు గంజి మాధవయ్య, జీవరత్నం నాయుడు, నారాయణబాబు పాల్గొన్నారు.

‘ఉపాధి’ ద్వారా పశుగ్రాసం పెంపకం



పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి

వడమాలపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశుగ్రాసం కొరత నివారణ కోసం ప్రభుత్వం ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తూ సబ్సిడీ రూపంలో అవకాశం కల్పిస్తోందని మండల పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి చెప్పారు. వేసవిలో పాడి ఆవులకు, పశువులకు పచ్చి గడ్డికోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత పశుగ్రాసం పెంపకానికి పాడి రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బుధవారం మండలంలోని రామసముద్రంలో పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పది సెంట్లలో గడ్డి పెంపకానికి ఏడాదికి రూ.6,598, 50 సెంట్లలో రూ.32,992 ప్రభుత్వం ద్వారా అందజేస్తామని చెప్పారు. మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో నేరుగా జమచేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన పాడిరైతులు దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్, ఉపాధి హామీ కార్డులు, పాస్ బుక్, అడంగల్ కాపీలు, రైతు ఫోటోతో పాటు అందజేయాలని చెప్పారు. పశు వైద్యశాల, రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ మేరకు రైతులకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ లైజనింగ్ అధికారి లోకనాథం, పాడిరైతులు పాల్గొన్నారు.

భూసమస్యపై జేసీ విచారణ



విచారణ చేస్తున్న జేసీ శుభంబన్సల్

పుత్తూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన భూసమస్యను జేసీ శుభం బన్సల్ బుధవారం సాయంత్రం విచారించారు. పట్టణంలోని సర్వేనెంబరు 34-1ఏలోని 2.24 సెంట్ల పట్టా భూమిని పొరబాటున రెవెన్యూ అధికారులు 22ఏ జాబితాలో చేర్చారు. ఈ విషయమై లబ్ధిదారుడు మునిరత్నం రెవెన్యూ సదస్సులో అర్జీ పెట్టుకున్నారు. దీనిని పరిశీలించిన రెవెన్యూ అధికారులు 22ఏ జాబితా నుంచి ఆ భూమిని తొలగిస్తున్నట్లు మునిరత్నంకు ఉత్తర్వులిచ్చారు. ఇదే సమయంలో జేసీ అర్జీదారుడి ఇంటి వద్దకు వచ్చి మరోసారి విచారించారు. సమస్యను పరిష్కరించడంతో జేసీకి మునిరత్నం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ అశోక్‌రెడ్డి, సర్వేయరు శేషమరాజు, ఇన్‌చార్జి ఆర్ఐ గురుస్వామి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

జగన్... బీసీలంటే అంత అలుసా: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జగన్.. బీసీలు అంటే అంత అలుసా అని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. బుధవారం టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు మీడియాతో మాట్లాడుతూ విధి నిర్వహణలో పక్షపాత రహితంగా చట్టాన్ని అనుసరించి అధికారుల సూచనలతో పనిచేస్తున్న పోలీసుశాఖలోని బీసీల బట్టలు విప్పుతానని మాజీ ముఖ్యమంత్రి చెప్పడం గర్హనీయమన్నారు. రాగద్వేషాలకు అతీతంగా విధినిర్వహణలో ఉన్న రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడిన జగన్ బీసీ సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు. ఒంటి మీద ఖాకీ చొక్కా పడాలంటే ఎంత కష్టమో తెలుసా అని ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాలు అన్ని విభాగాల్లో తన సొంత సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇచ్చారన్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో బీసీ అధికారులు కీలకస్థానాల్లో ఉండటాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు నెమళ్లూరు బుజ్జి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, భాస్కర్, మణి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ కుమారుడు కోలుకోవాలని పూజలు



ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు జరిపిస్తున్న జన సైనికులు

పిచ్చాటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి ఆంజనేయ స్వామి గుడిలో బుధవారం జన సైనికులు ప్రత్యేక పూజలు చేసి పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని స్వామిని వేడుకున్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు సుగంధర్, రాజశేఖర్, నాగేంద్ర, ఫ్రాంక్లిన్, పాండియన్, కిషోర్, వినీల్ కుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పుష్పమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం తొండంబట్టులో టీడీపీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ వెంకటేశ్వర్లు తల్లి పుష్పమ్మ ఇటీవల మరణించగా బుధవారం అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం విచ్చేసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకటేశ్వర్లును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, నాయకులు కరుణాకర్ నాయుడు, కుమార్, నందకిషోర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటయ్య, నరసరాజు, రమణయ్య, ప్రశాంత్, రమేష్, లక్ష్మీపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కడూరు గ్రామంలోని విమలమ్మ, గుడావారిపాళెంలో స్వర్ణమ్మలకు కూడా నివాళులు అర్పించారు.

గ్రామకంఠం భూములను కాపాడండి



వినుతకు వినతిపత్రం అందజేస్తున్న మల్లంపల్లి గ్రామస్తులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠం భూములను కాపాడాలని ఏర్పేడు మండలం అముడూరు పంచాయతీ మల్లంపల్లి గ్రామస్తులు కోరారు. బుధవారం వారు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుతను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మల్లంపల్లి గ్రామంలో సర్వే నెంబరు 300/10లో 1.92 ప్రభుత్వ గ్రామ కంఠం భూములను వైసీపీకి చెందిన వారు కబ్జా చేసి పట్టాలు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆ భూమిలో ఆస్పత్రి లేదా పిల్లలకు క్రీడా మైదానం వంటివి ఏర్పాటు చేయాలనుకుంటుంటే కొందరు దానిని కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన వినుత ఈ విషయాన్ని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి తెలపగా ఆయన సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి పట్టాల కోసం కొనసాగుతున్న దీక్షలు



దీక్ష చేస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కోసం చేస్తున్న రిలే దీక్షలు బుధవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ ఇంటి స్థలాల కోసం దళితులు దీక్షలు చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇంటి పట్టాలు ఇవ్వకపోతే జిల్లా స్థాయిలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. దళితులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణులకు భోజనం పెడుతున్న డాక్టర్లు, సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యులు మాధవి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 70 మంది గర్భిణులకు డాక్టర్లు మాధవి, విద్యాసాగర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మొదటి కాన్పు గర్భిణులు తమ బ్యాంకు అకౌంట్, ఆధార్, మొబైల్ నెంబర్‌తో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కోసం నమోదు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు బ్యాంకు ఖాతాలో వేస్తుందని తెలిపారు. గర్భిణులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స

వరదయ్యపాళెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలవల్లం ఏకం ప్రాంగణంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ చికిత్స వలన పలు రోగాల నుంచి ఉపశమనం పొందవచ్చని చెప్పారు.

సినీ నటులు విజయశాంతి, కల్యాణ్‌రామ్‌కు ఘన స్వాగతం



రేణిగుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు సినీ నటీ, నటుడు విజయశాంతి, కల్యాణ్‌రామ్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. చిత్తూరులో ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాలోని పాట విడుదల కార్యక్రమానికి హాజరయ్యేందుకు బుధవారం మధ్యాహ్నం హైదరాబాదు నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన చిత్తూరు బయలుదేరి వెళ్లారు.

దూడను తప్పించబోయి మూడు వాహనాల ఢీ



పల్లెవెలుగు బస్సు వెనుక వైపున ఢీకొన్న టాటా సుమో

రేణిగుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దూడను తప్పించబోయి మూడు వాహనాలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న సంఘటన పట్టణంలోని వంతెనపై బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తిరుపతి నుంచి రేణిగుంటకు పట్టణంలోని వంతెనపై వస్తుండగా ఓ దూడ అడ్డురావడంతో కారు డ్రైవర్ సడన్ బ్రేకు వేశాడు. ఇదే క్రమంలో వెనుక వస్తున్న పల్లెవెలుగు బస్సు, దాని వెనుక వస్తున్న టాటా సుమో వాహనం ఒకదాని వెనుక ఒకటి ఢీకొనడంతో వాహనాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో వాహన యజమానులు వెళ్లిపోయారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

పిచ్చాటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు వైఎస్‌ఆర్ సర్కిల్ పరిధిలో కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో టీచర్స్ కాలనీకి చెందిన మంజుల(43) గాయాలకు గురైంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 ద్వారా పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను విచారిస్తున్నారు.

ఆర్టీసీ జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా రాజేశ్వరరావు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏపీఎస్ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన గుమ్మల్ల రాజేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో అదనపు జిల్లా కోర్టు ఏర్పడిన తరువాత మొదటిసారిగా ఏపీఎస్ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన విజయ్

వరదయ్యపాళెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. వరదయ్యపాళెం పోలీసుల కథనం మేరకు.. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కంచనపుత్తూరు గ్రామానికి చెందిన విజయ్, సమీప బంధువు వరదరాజులతో కలిసి వరదయ్యపాళెంకు వస్తుండగా మండలంలోని రాచకండ్రిగ వద్ద ఆగిఉన్న ఓ వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో విజయ్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, వరదరాజులు తీవ్రంగా గాయపడ్డాడు. వరదయ్యపాళెం పోలీసులు అక్కడికి చేరుకుని విజయ్ మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వరదరాజులను కూడా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొరాయించిన బస్సు



టూరిస్టు బస్టాండు వద్ద మొరాయించిన ప్రైవేటు బస్సు - మరమ్మతులు చేస్తున్న మెకానిక్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి విచ్చేసిన యాత్రీకుల బస్సు మొరాయించింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో టూరిస్టు బస్టాండు వద్ద ఓ ప్రైవేటు బస్సు వెలుపలకు వచ్చే క్రమంలో డిక్కీ కల్వర్టుకు తగలడంతో అక్కడికక్కడే నిలిచిపోయింది. భరద్వాజ తీర్థం, ముక్కంటి ఆలయ, శుకబ్రహ్మాశ్రమం మూడు మార్గాలకు రాకపోకలు సాగించే ఈ కూడలిలో బస్సు ఆగిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బస్సులోని యాత్రీకులు స్థానిక మెకానిక్ సాయంతో సుమారు గంట పాటు శ్రమించి మరమ్మతులు పూర్తి చేయించుకుని వెళ్లారు.

ఇదేం చోద్యం

- ప్రభుత్వ అధికారికి ఓ రూలు... ప్రజలకు మరో రూలా



అధికారి ఇంటిని వదిలి తవ్విన కాలువ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పురపాలక సంఘ అధికారులు కాలువల నిర్మాణం చేపడుతున్నారు. ప్రజల ఇంటి ముందు జేసీబీ సాయంతో కాలువ కోసం తవ్వారు. కాలువపై నిర్మాణం చేసుకున్న మెట్లను సైతం తొలగించారు. అయితే ఓ పంచాయతీ అధికారి మాత్రం తన ఇంటి ముందు జేసీబీతో తవ్వవద్దని హుకుం జారీ చేయడంతో కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి తిరిగి వెళ్లిపోయాడు. దీంతో చేసేదేమీలేక అధికారి చెప్పినట్లు మనుషులతో తవ్విస్తున్నారు. అయితే సదరు పంచాయతీ అధికారి ఇంటి ముందు మెట్లు తొలగించకుండా కాలువ నిర్మాణం ఎలా చేపడుతారో ఆ కాంట్రాక్టర్‌కే తెలియాలి. ఇలాంటివి పునరావృతమైయితే అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఇలాంటి పనులే చేస్తారు. సామాన్య ప్రజలకు ఒక న్యాయం, అధికారులు, నాయకులకు ఒక న్యాయమా అని పలువురు విమర్శిస్తున్నారు. పురపాలక సంఘ కమిషనర్ చొరవ తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయానికి పూజా సామగ్రి వితరణ



ఈవోకు పూజా సామగ్రిని అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెన్నై విమానాశ్రయ ఏజీఎం ధర్మలింగం హారతులు సమర్పించే తట్టలు, వీఐపీ పూర్ణకుంభ వస్తువులను బుధవారం విరాళంగా అందజేశారు. ఆయన తరపున ముక్కంటి ఆలయ డోల్ విద్వాంసుడు ముని మల్లికార్జున్ అందజేశారు. దాతలకు ఈవో బాపిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరానగర్ సర్పంచి చెక్‌పవర్ మరో మూడు నెలలు రద్దు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ సర్పంచి సల్లా వీరభద్రయ్య నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో గతంలో చెక్‌పవర్‌ను రద్దు చేశారు. దీనిని మరో మూడు నెలలపాటు పొడిగిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బుధవారం తెలిపారు.

నువ్వుల పంటలో క్షేత్ర దినోత్సవం

కేవీబీపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేడులో నువ్వుల ప్రదర్శన క్షేత్రాల్లో బుధవారం రాస్ కేవీకే శాస్త్రవేత్తలు క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. గత డిసెంబరు నెలలో ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం నువ్వులలో శారద రకపు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. దీంతో పాటు కలుపు, పురుగుమందులు, తెగుళ్ల నివారణ మందులను పంపిణీ చేశారు. దీంతో రాస్ కేవీకే శాస్త్రవేత్తలు బుధవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. వాటిని పరిశీలించారు. ఎకరాకు నాలుగు నుంచి ఆరు బస్తాల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేశారు. సహజంగా నువ్వుల పంట ఎకరాకు రెండు బస్తాలే వస్తాయని, ఈ కొత్త విత్తనం ద్వారా ఆరు బస్తాల వరకు రావచ్చని చెప్పారు. రైతులు ఈ పంటకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాస్ కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ దివ్య, రామ్‌కుమార్, రైతులు, సీపీఎం రైతు కార్యదర్శి దాసరి జనార్దన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు నాయుడు అన్నారు. కళాశాల ఆవరణను బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా దీనిని నిర్వహించామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు బావనయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచాలి



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ, సీపీఎం నాయకులు

రేణిగుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రేణిగుంట పంచాయతీ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికులు బుధవారం ఉదయం నిరసన తెలియజేశారు. వీరికి ఏఐటీయూసీ, సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఏప్రిల్ నెల నుండి పారిశుధ్య కార్మికులకు రూ.18 వేలకు వేతనం పెంచుతామని ఇచ్చిన హామీని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు సుబ్బరాజు, కళా, చలపతి, రమణ, సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, హరినాథ్, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని కుమారవెంకటపురం గ్రామంలో రీ సర్వేపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ రెవెన్యూ గ్రామంలో మొత్తం 133.45 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డీకేటీ భూములు 101.45 ఎకరాలు, మిగతా పట్టా భూములు ఉన్నాయన్నారు. సర్వేతో భూ వివాదాలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. రైతులు సర్వే జరిగేటప్పుడు వారి భూముల దగ్గర రికార్డులతో ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, సర్వేయరు రాజ్‌కుమార్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ద్వివర్ణ శోభితం



అందరినీ ఆకర్షిస్తున్న కశ్మీర్ చెట్టు

రేణిగుంట పట్టణంలోని మంచినీళ్ల గుంటలో వాకర్లను ఓ చెట్టు ఆకర్షిస్తోంది. మంచినీళ్లగుంట సుందరీకరణలో భాగంగా లోపల ఓ మొక్కను నాటారు. ఆ మొక్క పెరిగి చెట్టు అయింది. ప్రస్తుతం తెల్లటి పూలతో అలరారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో లేలేత సూర్య కిరణాలు ఆ చెట్టుపై పడి కశ్మీరు మంచు కొండల్లో చెట్టును తలపిస్తోంది. సూర్య కిరణాలు పడి పూలు దగదగా మెరుస్తున్నాయి. ఇక ప్రతి వేసవిలో కాసే ఈ పూలు ఉదయం ఒక రంగు, సాయంత్రం మరో రంగులో కనిపిస్తూ వాకింగ్‌కు వచ్చే వారిని మైమరపిస్తున్నాయి.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తిలో కిష్కింధకాండ



హరహరబావివీధిలో ఇంట్లోకి చొరబడ్డ కోతులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో కోతుల బెడద కిష్కింధకాండను తలపిస్తోంది. పట్టణంలోని 35 వార్డుల్లో సుమారు లక్ష మంది జనాభా నివసిస్తుంటారు. పట్టణ ప్రధాన వీధుల్లో కోతుల సమస్య రోజురోజుకు అధికమవుతోంది. గుంపులు గుంపులుగా కోతులు ఇళ్లపైకి చొరబడుతున్నాయి. వీధుల్లో పిల్లలు పాఠశాలలు, దుకాణల నుంచి తినుబండారాలతో రాకపోకలు సాగించే క్రమంలో కోతుల మూక దాడి చేస్తున్నాయి. ప్రధానంగా ఈ సమస్య పట్టణంలోని జెట్టిపాళెం, ముత్యాలమ్మగుడివీధి, పీవీరోడ్డు, కొత్తపేట, హరహరబావివీధి, గాండ్ల వీధి తదితర చోట్ల అధికంగా ఉంది. పురపాలక సంఘ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శికి సహకరించని సచివాలయ సిబ్బంది

- ప్రభుత్వ సర్వేలలో వెనకడుగు

రేణిగుంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యదర్శి మణికి సచివాలయ సిబ్బంది సహకరించకపోవడంతో ప్రభుత్వ సర్వేలలో మండలంతో పోలిస్తే రేణిగుంట పంచాయతీ సర్వే పూర్తిస్థాయిలో వెనకబడింది. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో వివిధ సర్వేలను సచివాలయ సిబ్బంది చేత నిర్వహిస్తోంది. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది చేత ఈ సర్వేలు చేయిస్తున్నారు. అయితే మండలంలో సర్వేలు పూర్తి కావస్తున్నా రేణిగుంట మేజర్ పంచాయతీలోని 1, 4, 5 సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో వెనుకపడడంతో పైస్థాయి అధికారుల నుంచి మండల అధికారులకు చివాట్లు తప్పట్లేదు. రేణిగుంట పంచాయతీ కార్యదర్శి మణికి సచివాలయ సిబ్బంది సహకరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సహకరించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.